క్లుప్తంగా

బొడ్డవరలో ఉచిత నేత్ర వైద్యశిబిరం


బొడ్డవరలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవరలో విశాఖ శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో బూడి జగదీష్ నేతృత్వంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. శస్త్రచికిత్సలకు ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు


యూరియా బస్తా బరువును తూకం వేయిస్తున్న అధికారులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్వీ రమణ అన్నారు. గరివిడి పట్టణంలో గల ఎరువుల దుకాణాలను ఆదివారం ఆయన స్థానిక ఏఓ పి.ప్రసాదరావుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. యూరియ ఎంతకు కొన్నదీ అడిగి తెలుసుకున్నారు. యూరియా కొన్నవారికి తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని దుకాణ యజమానిని ఆదేశించారు.

ఒరిగిన ట్రాన్స్‌ఫార్మర్


పక్కకు ఒరిగిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కొత్తవలస: మండలంలోని కొత్తవలస – సబ్బవరం రోడ్డులో గనిశెట్టిపాలెం గ్రామం జంక్షన్ సమీపంలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్లాట్‌ఫామ్ అత్యంత ప్రమాదకరంగా మారింది. ప్లాట్‌ఫారం నాలుగు వైపులా బీటలు వారడంతో ట్రాన్స్‌ఫార్మర్ ఓ వైపు ఒరిగిపోయింది. ఎటువంటి ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని గులివిందాడ, గనిశెట్టిపాలెం, సంతపాలెం, తదితర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


మండల కేంద్రంలోని దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏఓ తిరుపతిరావు

గుర్ల: రైతులకు యూరియా అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రైవేట్ దుకాణదారులకు ఏఓ తిరుపతిరావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ఎరువులు దుకాణాలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఏడు రైతుసేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందన్నారు. యూరియా కొరత లేదని చెప్పారు. యూరియాను ఎవరైనా బ్లాక్ చేస్తే దుకాణదారుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని తెలిపారు.

మంగళసూత్రాల బహూకరణ


అమ్మవారికి బంగారు మంగళ సూత్రాలు బహూకరిస్తున్న దాత

చీపురుపల్లి: పట్టణంలోని కనక మహాలక్ష్మి అమ్మవారికి జి.సతీష్‌కుమార్ అనే భక్తుడు బంగారు మంగళసూత్రాలు బహూకరించారు. ఆదివారం స్థానిక దేవస్థానం మంటపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈఓ బి.శ్రీనివాసరావుకు మంగళసూత్రాలు అందజేసారు. ఈ సందర్భంగా ఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మండలంలోని పేరిపి గ్రామానికి చెందిన జి.సతీష్‌కుమార్ రూ.43 వేల విలువైన బంగారు సూత్రాలు అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధి గవిడి నాగరాజు, కెంబూరి సాయి, తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

గుర్ల: మండలంలోని అచ్యుతాపురం వద్ద గుర్తు తెలియని వృద్ధుడు ఆదివారం మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని ఎవ్వరూ పట్టించుకోలేదు. విషయం తెలుసుకున్న ఏఎస్సై కామేశ్వరరావు, స్వాస్ స్వచ్ఛంద సంఘ అధ్యక్షుడు బి.పైడినాయుడు హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు చేపట్టారు.

ఇంటింటికీ చంద్రబాబు మోసాలు..

- మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి రూరల్ (గరివిడి): తప్పుడు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు ప్రజలను ఎలా మోసం చేసిందీ ఇంటింటికీ వెళ్లి వివరించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గరివిడి మండలంలోని రేగటి గ్రామంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదమూడు నెలలు గడిచినా నేటికీ కూడా ఎన్నికల హామీలను అమలు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హామీలు అమలు చేయకపోవడం వల్ల ఒక్కో కుటుంబం ఎంత నష్టపోయినదీ ఇంటింటికీ వెళ్లి వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.


మాట్లాడుతున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

కూటమి నాయకుల వైఫల్యాలను ప్రజల తరఫున ప్రశ్నిస్తామని, అవసరమైతే పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు కడుమల రాంబాబు, మాజీ సర్పంచ్ అలమండ అప్పలనాయుడు, పాసి రాము, పార్టీ మండల అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ జి. శ్రీరాములనాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయుడు, కొండపాలెం మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ బమ్మిడి కార్తీక్, పలు పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు గుడివాడ తమ్మినాయుడు, యల్లంటి పోలీస్‌నాయుడు, రఘుమండ శ్రీదేవి, ముద్దాడ రమణ, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాబు పాలన అంతా మోసం..


చిన గుడిపాల గ్రామంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వేపాడ: బాబు గారి పాలనంతా మోసమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మండలంలోని వీలుపర్తి, వావిలపాడు, నల్లబిల్లి, చినగుడిపాల, ఎన్‌కేఆర్ పురం గ్రామాల్లో మండల వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మమ్ములూరి జగ్గబాబు నేతృత్వంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి నాయకుల వైఫల్యాలను వివరించారు. ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, దీపం, ఉచిత బస్, 50 ఏళ్లకే పెన్షన్ వంటి పథకాల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని మండిపడ్డారు. సంపద సృష్టించడం అంటే ప్రజలని దోచేయడమే అని మరోమారు కూటమి ప్రభుత్వం రుజువు చేసిందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ మూకల కస్తూరి, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, నిరుజోగి వెంకటరావు, భోజంకి శ్రీను, ఆకుల సత్తిబాబు, గోకాడ సత్యంనాయుడు, రావాడ వెంకటరావు, పచ్చికూర అప్పలనాయుడు, బీల సతీష్, గండి శ్రీరామ్మూర్తి, శంకరరావు, చిరంజీవి, భోజంకి రామునాయుడు, వేచలపు ఈశ్వరరావు, కె.పెదనాయుడు, సీహెచ్ రమణ, వేచలపు రామ్మూర్తినాయుడు, కృష్ణ, వీటీపీ నాయుడులతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం


ఎం.లింగాలవలసలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దత్తిరాజేరు: అధికారం కోసం తప్పుడు హామీలిచ్చి.. వాటిని అమలు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఘోరంగా విఫలమయ్యారని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున ఆరోపించారు. మండలంలోని దాసుపేట, గడసాం, ఎం. లింగాలవలస, కన్నాం గ్రామాల్లో సిరిపరపు శంకరరావు, నేతేటి వెంకటరమణ, బూడి గణపతి, మండల శ్రీనివాసరావు, చలుమూరి సన్యాసిరావు అధ్యక్షతన ఆదివారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఆడబిడ్డ నిధి.. వితంతు పింఛన్లు.. అన్నదాత సుఖీభవ.. 50 ఏళ్లకే పింఛన్.. ఉచిత బస్సు వంటి పథకాలు అమలు చేయకపోవడం వల్ల ప్రతి ఒక్కరూ ఎంతో నష్టపోయారని చెప్పారు. హామీలు అమలు చేయలేనప్పుడు ఎందుకివ్వాలని.. ఈ విషయంలో కూటమి నాయకులను నిలదీయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, నాయకులు రేవళ్ల నారాయణప్పుడు, మహదేవ్ ఫణీంద్రుడు, రెడ్డి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

నివాళులు..


అబ్దుల్‌కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): దేశ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా గరివిడిలో గల వి కన్వెన్షన్‌లో గల కలాం విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు, జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, తదితరులు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రపతిగా దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. నిరుపేద కుటుంబంలో జన్మించి ఉన్నత స్థాయికి చేరుకున్న ఆయన జీవితం ఎంతోమందికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో కొండపాలెం మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ బమ్మిడి కార్తీక్, శివుకు కాంతారావు, మజ్జి సంతోష్, నాయుడు, శంకర్, చిన్న అప్పలనాయుడు, కెల్ల రమణారావు, పిల్ల ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయండి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి

లక్కవరపుకోట: కార్పొరేట్ శక్తులకు, యాజమాన్యాలకు అనుకూలంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి. లక్ష్మి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సీఐటీయూ రెండో మండల మహాసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సహకారంతో దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు ఇస్తున్న అరకొర వేతనాలను కూడా సకాలంలో ఇవ్వడం లేదని ఆరోపించారు. అంతకుముందు 16 మందితో కూడిన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా గొల్ల దేవి, కో కన్వీనర్‌గా చీపురపల్లి అప్పారావు నియమితులయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గాడి అప్పారావు, తరిణి వెంకటరమణ, గొల్ల కామేష్, సంతోషి, తదితరులు పాల్గొన్నారు.


సీఐటీయూ జెండాను ఎగురవేస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి

తులసీరావు సేవలు వెలకట్టలేనివి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: గొట్లాం మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు మీసాల తులసీరావు పార్టీ కోసం చేసిన సేవలు వెలకట్టలేనివని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. గొట్లాం గ్రామంలోని అయన స్వగృహం ఆవరణలో ఆదివారం సంతాప సభ నిర్వహించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు, రాష్ట్ర నాయకులు బీవీ ప్రభుజీరాజు, పార్టీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, బోడసింగి జగదీశ్, మహంతి రమణ, కర్రోతు శ్రీనివాస్, తాళ్లపూడి అప్పలనాయుడు, మండల రామునాయుడు పాల్గొన్నారు.


తులసీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గేట్ పడితే 20 నిమిషాలు నిరీక్షించాల్సిందే..

జామి: మండలంలో అట్టాడ, భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ మధ్య ఉన్న రైల్వేగేటతో అట్టాడ, తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గేట్ పడితే సుమారు 20 నిమిషాలు వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోంది. సమీపంలో కోరుకొండ రైల్వేస్టేషన్ ఉండడంతో గేట్ పడితే వాహనదారులు ఎండలో చాలాసేపు వేచి ఉండాల్సి వస్తోంది. ముఖ్యంగా రోగులు ఆస్పత్రికి వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. చాలా చోట్ల ఆర్‌యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మాణాలు జరిగాయి. అట్టాడ వద్ద ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టాలని రైల్వే అధికారులకు పలుమార్లు కోరినా ఫలితం లేకపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అట్టాడ – భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ మధ్య రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



అట్టాడ – భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ మధ్య ఉన్న రైల్వేగేట్

కాటాలో తేడా ఉంది..

- ఎంఎల్‌ఎస్ పాయింట్ అధికారులకు నోటీసులు

మెరకముడిదాం: చీపురుపల్లి ఎంఎల్‌ఎస్ పాయింట్ గొడౌన్‌లో తూనిక యంత్రంలో (కాటా) తేడా ఉందని.. అందుకే డీలర్లకు తక్కువ బియ్యం వెళ్తున్నాయని అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఎంఎల్‌ఎస్ పాయింట్ అధికారులకు నోటీసులు జారీ చేసినట్లు పౌరసరఫరాల శాఖాధికారులు అసిస్టెంట్ మేనేజర్ శ్రీరామ్, అసిస్టెంట్ మేనేజర్ (అకౌంట్స్) వెంకటరమణ, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. మెరకముడిదాం మండలానికి చెందిన డీలర్లు తమకు వస్తున్న బియ్యంలో తేడా లున్నట్లు మండల తహసీల్దార్ సులోచనారాణికి శనివారం ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి చీపురుపల్లిలో గల ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను ఆదివారం తనిఖీ చేశారు. తూనిక యంత్రంలో తేడాలున్నట్లు గుర్తించి, బాధ్యులకు నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో మెరకముడిదాం తహసీల్దార్ సులోచనారాణి, తదితరులు పాల్గొన్నారు.


చీపురుపల్లి ఎంఎల్‌ఎస్ పాయింట్ గొడౌన్‌లో తనిఖీలు చేస్తున్న పౌరసరఫరాలశాఖ అధికారులు

'సాగు'బాటలో రైతాంగం

- ముమ్మరంగా వరి నాట్లు
- కూటమి సాయం లేకపోయినా ముందుకు 'సాగు'తున్న అన్నదాతలు
- నియోజకవర్గ పరిధిలో 16,533 హెక్టార్లలో వరి పంట సాగు

కొత్తవలస: నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో ఖరీఫ్ వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గడిచిన పది రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు దమ్ములు ప్రారంభించారు. గత ప్రభుత్వ పాలనలో రైతు పెట్టుబడి కింద ఖరీఫ్ సీజన్ తొలి దశలోనే సహాయం అందించారు. దీంతో రైతులు రెట్టించిన ఉత్సాహంతో సాగు చేపట్టారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అన్నదాతను ఆదుకునేవారు లేకుండా పోయారు. ప్రభుత్వ సాయం లేకపోవడంతో అప్పులు తెచ్చిమరీ సాగుకు రైతులు సిద్ధమయ్యారు. నియోజకవర్గ పరిధిలోని కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, జామి, ఎస్.కోట మండలాల్లో రైతులు ముమ్మరంగా దమ్ములు చేస్తూ బిజీబిజీగా ఉన్నారు. ప్రస్తుత ఏడాదికి సంబంధించి మండలాల వారీగా వరి సాధారణ విస్తీర్ణం విషయానికొస్తే కొత్తవలస మండలంలో 890 హెక్టార్లు.. లక్కవరపుకోటలో 3,604 హెక్టార్లు.. జామి మండలలో 5,322 హెక్టార్లు.. ఎస్.కోట మండలంలో 3,171 హెక్టార్లు.. వేపాడ మండలంలో 3,546 హెక్టార్లలో సాగు జరగనుంది. ఇదిలా ఉంటే ఇప్పటి వరకు నియోజకవర్గంలో సుమారు 30 శాతానికి పైగా వరి నాట్లు పూర్తయినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కాగా రైతులకు అవసరమైన 1,607 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు భానులత తెలిపారు. దమ్ము పట్టేముందు పొలాన్ని రెండు పర్యాయాలు కలియ దున్ని మూడు రోజులు పాటు ఉంచిన తర్వాత నాట్లు వేయాలని ఆమె సూచించారు.


లక్కవరపుకోట మండలం లచ్చింపేట సమీపంలో ట్రాక్టర్‌తో దమ్ము


వరి నారు తీస్తున్న మహిళా రైతులు


కొత్తవలస మండలం అప్పన్నపాలెం సమీపంలో వరి నాట్లు వేస్తున్న మహిళలు

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా..

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అప్పారావు


బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అప్పారావును సన్మానిస్తున్న పార్టీ నాయకులు

కొత్తవలస: భారతీయ జనతా పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన చొక్కాకుల అప్పారావు అన్నారు. మండల కేంద్రంలోని బీవీకే పాఠశాల ఆవరణలో జరిగిన ఓ కార్యక్రమంలో అప్పారావు దంపతులను బీజేపీ శ్రేణులు ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ.. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాన్యం దేముడు, గోపి, తమటపు రాముడు, వీర్రాజు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సేవలతో పేదలకు మేలు


సచివాలయ ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచ్ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు జరిగిందని అలజంగి సర్పంచ్ రఘుమండ రమణమ్మ అన్నారు. అలజంగి సచివాలయంలో ఇంతవరకు విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉద్యోగులను ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో అర్హులైన పేదలకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు చేరవేశారన్నారు. ఎటువంటి పైరవీలు లేకుండా అప్పట్లో అర్హులకు సంక్షేమ పథకాలు అందేవని.. ఈ విషయంలో సచివాలయ సిబ్బంది సహకారం మరువలేనిదన్నారు. బదిలీ అయిన ప్రాంతాల్లో కూడా సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రఘుమండ త్రినాథరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రేవల్ల సత్తిబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బవిరి రవిశంకర్, బి.రవికిశోర్, డి.రాము, పి.సూర్యనారాయణ, ఎం.మహాలక్ష్మంనాయుడు, కె.గొల్లబాబు, పి.గురువులు, ఎన్.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సౌమ్యకు డాక్టరేట్..

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం గ్రామానికి చెందిన ముదునూరు సౌమ్య గీతం యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందింది. ఈ మేరకు విశాఖపట్టణం ఎంపీ, గీతం యూనివర్సిటీ యాజమాన్య ప్రతినిధి ఎం.భరత్, బోస్ సంస్థ ఉపాధ్యక్షుడు ఎస్.నారాయణ్ యూనివర్సిటీలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో సౌమ్యకు డాక్టరేట్ పట్టా అందజేశారు. రసాయన శాస్త్రంలో ఐరిన్ ఆక్సైయిడ్‌తో కూడిన నానో కణాలు, పారా ఆల్కాక్సిబెంజాయిక్ ఆమ్లా ద్రవ స్పటికలు – సంశ్లేషణ, తదితరాలపై చేసిన పరిశోధనలకు గాను సౌమ్యకు డాక్టరేట్ లభించింది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కొత్తవలస: మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003 – 04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీక కలయిక పేరిట సమావేశమయ్యారు. సుమారు 21 సంవత్సరాల తర్వాత అందరూ కలుసుకోవడంతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది. ఈ సందర్భంగా ఒక్కొక్కరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి సంగతులను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చీపురపల్లి ఈశ్వరరావు, పీడీ కృష్ణంరాజు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

చినుకు పడితే చిత్తడే..


గజపతినగరం దిగువవీధిలో గోతులతో దర్శనమిస్తున్న రహదారి


ఎన్‌జీఆర్ పురంలో చిత్తడిగా మారిన జగనన్న కాలనీ రోడ్డు

గజపతినగరం: మండల కేంద్రంలోని దిగువవీధిలోను, ఎన్‌జీఆర్ పురం జగనన్న కాలనీ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. చినుకు పడితే రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరం దిగువవీధి రోడ్డులో బాలసదన్ వసతిగృహం, వెనుకబడిన బాలికల వసతిగృహం, సోషల్ వెల్ఫేర్ వసతిగృహం, గ్రామ సచివాలయం, రైతుసేవా కేంద్రాలున్నాయి. ఆయా కార్యాలయాలకు వెళ్లేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఓవర్‌లోడ్‌తో రాకపోకలు

- అరుకు – విశాఖ రోడ్డులో ప్రయాణమంటేనే హడలిపోతున్న వాహనదారులు

కొత్తవలస: మండలంలోని అరుకు – విశాఖ జాతీయ రహదారిలో ప్రయాణం అంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. ఈ రోడ్డులో నిత్యం లారీలు పరిమితికి మించి స్లాగ్ (బూడిద) వేసుకుని రాకపోకలు సాగిస్తున్నాయి. విశాఖపట్నం నుంచి మండల పరిధిలో ప్రస్తుతం నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణాలకు స్లాగ్ తీసుకువస్తున్నారు. అయితే పరిమితికి మించిన లోడ్‌తో రాకపోకలు సాగిస్తున్నందున రహదారులు పాడవుతున్నాయని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లారీల వెనుక వెళ్లే వాహనదారుల కళ్లల్లో బూడిద పడుతుండడంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు గాని ఇతర అధికారులు గాని ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇటువంటి లారీలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.


అరుకు – విశాఖ రోడ్డులో అధిక లోడ్‌లతో ప్రయాణిస్తున్న లారీలు